సాక్షి రంగారెడ్డి

బుధవారం । 25 । అక్టోబర్ । 2023



విద్యారంగం భ్రష్టు పట్టింది

నిద్రావస్థలో ఉన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కల్వకుర్తి అభివృద్ధికి కుంటుపడిందని ఎమ్మెల్సీ కసిరెడ్డి ఆరోపించారు. 10లో▸



యాచారంలో రావణాసురిడి బొమ్మను దహనం చేస్తున్న ప్రజలు



చేవెళ్ల: దుర్గామాత విగ్రహాన్ని పుష్కరిణిలో నిమజ్జనం చేస్తున్న భక్తులు



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్‌లో దసరా వేడుకల్లో భక్తజనులు

కనుల పండువగా విజయదశమి

దసరా పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. 'శమీ శమయితే పాపం.. శమీ శత్రువినాశనం, అర్జునస్య ధనుర్ధారీ రామస్య ప్రియదర్శిని' అంటూ భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సాయంకాలం జమ్మి పూజ అనంతరం రావణాసురిని ప్రతిమ దహనం కనుల పండువగా సాగింది. దేవీ నవరాత్రుల్లో భాగంగా కొలువుదీరిన అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేయగా.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేవంత్‌రెడ్డిని కలిసిన కసిరెడ్డి



రేవంత్‌రెడ్డితో నారాయణరెడ్డి తదితరులు

ఆమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు ఎనుమల రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ కల్వకుర్తి అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా వేడుకల సందర్భంగా నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లిలోని తన నివాసానికి రెవంత్ వచ్చారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని కసిరెడ్డితో పాటు స్థానిక నాయకులు సంజీవ్‌యాదవ్, సురేందర్ రెడ్డి, ఆనంద్‌కుమార్ తదితరులు కలిశారు.

యువకుడికి సన్మానం



ప్రేమ్‌కుమార్‌ను సన్మానిస్తున్న రాదమ్మ

ఆమనగల్లు: ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపికైన యువకుడిని ఘనంగా సత్కరించారు. మున్సిపాలిటీ పరిధి సంకటోనిపల్లి గ్రామానికి చెందిన ఏకుల అంజయ్య, నర్సమ్మల కుమారుడు ప్రేమ్‌కుమార్ పోలీసు ఉద్యోగానికి ఎంపికైన సందర్భంగా మంగళవారం ఆయన్ను, ఆయన తల్లిదండ్రులను కౌన్సిలర్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ కమటం రాధమ్మ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇందులో నాయకులు వెంకటయ్య, ధనుంజయ, అనంతం, యాదగిరి, రవీందర్, జైపాల్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు బాల్‌రాజ్, మహేశ్, యాదగిరి, నిరంజన్, మల్లేశ్, వంశీ, సుధీర్, శ్రీశైలం, నరేశ్, రాజు, మల్లేశ్, శ్రీకాంత్, శ్రీదర్ ఉన్నారు.

ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్: ఇద్దరు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం రస్‌అల్‌ఖైమా నుంచి వచ్చి ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా 483 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాని విలువ రూ.29.48 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. దుబాయ్ నుంచి మరో ప్రయాణికుడి లగేజీలో 610 గ్రాముల బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. బంగారం విలువ రూ.32 లక్షలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్' పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచ శాంతి, మానవత్వం, సమానత్వాలను ఆకాంక్షిస్తూ ప్రముఖ రచయిత, గిన్నిస్ రికార్డ్ విజేత వంగీపురం శ్రీనాథాచారి రచించిన 'యాన్ ఇన్వాల్యుబుల్ ఇన్వొకేషన్' ఆంగ్ల పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జూబ్లీహిల్స్‌లోని దస్‌పల్లా హోటల్‌లో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న డిజీ బి.సుమతి మాట్లాడుతూ విశ్వవ్యాప్త దృక్పథంతో ఈ రచన సాగిందంటూ రచయితను ప్రశంసించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఈ బుక్‌గా అందుబాటులో ఉన్న ఈ పుస్తకం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పుస్తకంగా పేర్కొన్నారు. దీని ఖరీదు రూ.5 కోట్లుగా నిర్ణయించామని, ఈ పుస్తకాన్ని ఐక్యరాజ్యసమితికి అంకితమిస్తూ.. పుస్తకంపై వచ్చే ఆదాయంలో 50శాతం అందిస్తున్నామన్నారు. అదే విధంగా సేవా కార్యక్రమాలకు తోడ్పాటుగా భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలకు 25శాతం చొప్పున అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సినీ రచయిత జేకే భారవి, భిన్న రంగాల ప్రముఖులు పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

దసరా ధూంధాం!

ఎన్నికల వేళ.. పండగే పండగ

- తాగినంత మద్యం, తిన్నంత మాంసం
- యువతకు లీడర్ల ఆఫర్లు
- గ్రామాలు, పట్టణాల్లో రాజకీయ విందులు
- గ్రూపులుగా దావత్‌లు



యాచారం: దసరా పండగ ఫుల్ జోష్‌తో ముగిసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎప్పుడూ లేని విధంగా విజయ దశమి వైభవంగా జరిగింది. యువత అడిగిందే తడవుగా రాజకీయ నాయకులు తినేవారికి తినేంత, తాగేవారికి తాగేంత మాంసం, మద్యం ఆఫర్ చేశారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా సందడి కనిపించింది. ఓటర్లను మచ్చిక చేసుకోవడం కోసం రాజకీయ పక్షాల నాయకులు యువతకు ఫోన్లు చేసి 'వచ్చేయండి.. చాల రోజులైంది కలుసుకోక.. దావత్ చేసుకుందాం రండి' అని బంపర్ ఆఫర్లు ఇచ్చారు. ముందస్తు ప్రణాళికతో ఉన్న రాజకీయ నాయకులు రెండు, మూడు రోజుల ముందే కావాల్సినంత మద్యాన్ని కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు సమాచారం.

రూ.కోటిన్నరకు పైగా మద్యం

యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, మాల్, గునుగల్, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో రూ.లక్షలు విలువ చేసే మద్యాన్ని నిల్వ చేశారు. తాజాగా పోలీసులు బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం మోపుతుండడంతో.. నేతలు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. దసరా పండుగ రోజు కేవలం మండల పరిధి 24 జీపీల్లో దాదాపు రూ.కోటిన్నరకు పైగా మద్యం తాగినట్లు తెలుస్తోంది. నగరం నుంచి దసరా పండుగకు గ్రామాలకు వచ్చిన ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువత గుంపులు, గుంపులుగా కూర్చొని దావత్‌లు చేసుకున్నారు. అధికార పార్టీతో పాటు కాంగ్రెస్ శ్రేణులు విందుల్లో బిజీబిజీగా కనిపించారు. దసరా, ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకుకోకుండా యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐలు సైదయ్య, రామాంజనేయులు బందోబస్తును ఏర్పాట్లు చేశారు.

మాల్‌లో ఒక్క రోజే 500లకు పైగా

దసరా వచ్చిందంటే ప్రజలు అధికంగా మద్యం, మాంసానికే ప్రాధాన్యత ఇస్తారు. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో మాల్ మార్కెట్లో సోమవారం సుమారు 500 వందలకు పైగా మేకలు, గొర్రె పొట్టేళ్లను మాంసం ప్రియులు కొనుగోలు చేశారు. మాల్‌తో పాటు నక్కర్తమేడిపల్లి, నందివనపర్తి, గునుగల్, చింతపట్ల, గడ్డమల్లయ్యగూడ, తక్కళ్లపల్లితండా, నల్లవెల్లి తండా, మంతన్‌గౌరెల్లి, కేసీతండా, భానుతండా, నక్కగుట్టతండాల్లో జీవాల క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. సుమారు 300 క్వింటాళ్లకు పైగా చికెన్ విక్రయాలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. దసరా సందర్భంగా యాచారం గ్రామంలో టెన్షన్ నెలకొంది. రావణాసురుడి ప్రతిమను కాల్చే విషయంలో ఇరు వర్గాలకు మధ్య అభ్యంతరాలు పొడచూపడంతో పోలీసులు కలగజేసుకుని సమస్య సద్దుమణిగేలా చేశారు.

సమన్వయంతోనే ప్రశాంతం



విజయదశమిని రాజకీయ పక్షాల నాయకుల సహకారం, సమన్వయంతో ప్రశాంతంగా జరిగే విధంగా కృషి చేశాం. ఎన్నికల షెడ్యూల్ నేపథ్యంలో ముందే హెచ్చరికలు జారీ చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని చెప్పాం. కొన్ని చోట్ల ఘర్షణలు జరిగే అవకాశం ఉందన్న సమాచారంతో ఇరువర్గాలను సమన్వయం చేశాం. పండుగ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నాం.

– సైదయ్య, సీఐ యాచారం

'ఆమె'పై అకృత్యాలు

కామాతురాణాం న భయం.. న లజ్జ.. అని అప్పుడెప్పుడో చెబితే... న వావి న వరుస... న దయ న జాలి...అంటూ అ'నాగరిక' సమాజం ఇప్పుడు చాటి చెబుతోంది. కన్నతండ్రులే కామాంధులై కూతుర్ని కాటేస్తున్నారు. ముక్కుపచ్చలారని 'చిరు'నవ్వుల్ని మృగాళ్లు చిదిమేస్తున్నారు. చివరికి నిస్సహాయ స్థితిలో ఉన్న మహిళకు మరో మహిళే శత్రువవుతోంది. మహిళా శక్తికి ప్రతీకగా దసరా పండుగ నృత్యాలతో హోరెత్తుతుండగా.. నగరంలో 'ఆమె'పై పైశాచిక కృత్యాల విలయతాండవం.. విషాదం నింపింది.

- కుమార్తెపై తండ్రి లైంగిక దాడి
- పోక్సో చట్టం కింద కేసు నమోదు



మీర్‌పేట: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి.. మృగంలా వ్యవహరించాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. మీర్‌పేట పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లాకు చెందిన మహిళ సుమారు 18 ఏళ్ల క్రితం కేబుల్ ఆపరేటర్‌గా పనిచేసే బత్తుల దుర్గాప్రసాద్ (43)ను ప్రేమ వివాహం చేసుకుంది. బతుకుదెరువు కోసం కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చిన వీరు ప్రస్తుతం అల్మాస్‌గూడ ఓ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె (17) రెండు నెలలుగా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటోంది. ఈ క్రమంలో బాలిక ఉంటున్న హాస్టల్ సిబ్బంది తల్లికి ఫోన్ చేసి, మీ కుమార్తె కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోందని, పరీక్షలు సరిగా రాయడం లేదని చెప్పారు. దీంతో తల్లి హాస్టల్‌కు వచ్చి బాలికను ఆరాతీసింది. ఆగస్టు 18న తండ్రి దుర్గాప్రసాద్ హాస్టల్‌కు వచ్చి తనను ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించినట్లు చెప్పింది. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి తండ్రి దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చాక్లెట్ ఇచ్చి చిన్నారిపై లైంగిక దాడి

బంజారాహిల్స్: ఆడుకుంటున్న చిన్నారికి(7) చాక్లెట్ ఇస్తానని గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 5లో ఓ ఇంటికి వాచ్‌మెన్‌గా వ్యవహరిస్తున్న మనోహర్ అనే వ్యక్తి ఈ నెల 23న మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారికి మాయమాటలు చెప్పి, చాక్లెట్ ఇస్తానని చెప్పి తన గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి రోదిస్తూ బయటకు వచ్చి తన తల్లికి విషయం చెప్పడంతో ఆమె మనోహర్‌ను నిలదీయగా సదరు ఇంటి యజమాని బయటికి వచ్చి తన వాచ్‌మెన్ ఏ తప్పు చేయ లేదని ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేసుకోవచ్చని సమాధానమిచ్చాడు. దీంతో బాధితురాలి తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుతు మనోహర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

ప్రేమ పేరుతో మోసం

జూనియర్ ఆర్టిస్టును మోసం చేసిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 2 ఇందిరానగర్‌లో నివసించే యువతి(29) జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తుంది. అదే ప్రాంతంలో ఉంటున్న ఫయాజ్ అలియాస్ మాసాన్ ఖాన్ ఆమెను ప్రేమిస్తున్నట్లు చెప్పడంతో ఇద్దరు కలిసి సహజీవనం చేస్తున్నారు. ఆమె రెండు సార్లు గర్భం దాల్చగా తనకు పిల్లలు ఇష్టం లేదంటూ గర్భస్రావం చేయించాడు. అయితే 2021 నవంబరు 25న ఆమె నిలోఫర్ ఆసుపత్రిలో శిశువుకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి ఫయాజ్ ఆమెను మరింత వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన బాధితురాలు ఫయాజ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మత్తు మందు కలిపి లైంగిక దాడికి యత్నం

ఇద్దరు మహిళలతో కలిసి ఓ వ్యక్తి ఘాతుకం

వెంగళరావునగర్ : ఓ మహిళకు మత్తుమందు ఇచ్చి లైంగిక దాడికి యత్నించిన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన మహిళ ఈనెల 13న భర్తతో గొడవపడి ఇంటి నుంచి వచ్చి యూసుఫ్‌గూడ బస్టాప్ వద్దకు చేరుకుంది. సాయంత్రం నుంచి ఆమెను గమనిస్తున్న ముగ్గురు వ్యక్తులు (ఇద్దరు మహిళలు, మరో పురుషుడు) ఆమె వద్దకు వచ్చి నిద్ర లేపారు. ఇక్కడ నిద్రించడం క్షేమం కాదని తమ ఇంటికి వచ్చి నిద్రపోయి ఉదయాన్నే వెళ్లిపోవచ్చని నమ్మబలికారు. దీంతో వారి మాటలు నమ్మిన బాధితురాలు వారితో పాటు ఎస్పీఆర్‌హిల్స్‌లోని బ్రహ్మశంకర్‌నగర్‌కు వెళ్లింది. ఆ సమయంలో వారు ఆమెకు కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చారు. ఆమె మత్తులోకి జారుకోగానే ముగ్గురు కలిసి ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. అంతేగాక ఆమె చెవి దుద్దులు లాక్కున్నారు. స్పృహలోకి వచ్చిన ఆమె వారి బారినుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లి తన భర్తకు ఈ విషయం చెప్పింది. కొద్ది రోజుల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె ఆదివారం రాత్రి భర్తతో కలిసి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సోమవారం బాధితురాలు చెప్పిన ఆనవాళ్ల ఆధారంగా ఒక మహిళను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం

- పెట్టుబడులకు అనువైన ప్రాంతం తెలంగాణ
- టీఎస్‌ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి
- కొంగరకలాన్‌లో కెన్స్ సెమికాన్ ఎలక్ట్రానిక్ కంపెనీకి భూమిపూజ
- హాజరైన రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్
- ఫాక్స్‌కాన్ తరహాలో మరో దిగ్గజ సంస్థ

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రం ఎంతో అనువైన ప్రదేశమని, పెట్టుబడులకు స్వర్గధామమని టీఎస్‌ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ సర్వే నంబరు 300లో ఫాక్స్‌కాన్ తరహాలో రూ.3 వేల కోట్లతో 46 ఎకరాల్లో కేన్స్ సెమికాన్ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక విధానం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఇండస్ట్రియల్ పాలసీలో తొమ్మిదేళ్ల కాలంలో అనేక మార్పులు తీసువచ్చామని తెలిపారు. టీఎస్‌ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు పదిహేను రోజుల్లో అనుమతులు ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని స్పష్టంచేశారు. ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఇక్కడ ప్రణాళిక రూపొందించామని వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. పెట్టుబడులకు అనువైన ప్రాంతం కాబట్టి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భూమి తీసుకున్న వెంటనే విద్యుత్, నీరుతో పాటు మౌలిక సదుపాయలు కల్పిస్తోందని చెప్పారు. తైవాన్, జపాన్‌ను తలదన్నేలా పరిశ్రమలకు తెలంగాణ ల్యాండ్ మార్క్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందని చెప్పారు.

అత్యంత నివాస యోగ్యమైన ప్రాంతం

కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెలిపారు. భారతదేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం తెలంగాణ అని స్పష్టంచేశారు. సేఫెస్ట్ సిటీగా నగరానికి నాలుగుసార్లు గుర్తింపు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడుల శాఖ సెక్రటరీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్రర ఎలక్ట్రానిక్స్ సెమికండక్టర్స్ డైరెక్టర్ సుజల్ కరంపూరి, కేన్స్ టెక్నాలజీ చైర్‌పర్సన్ సవితా రమేష్, శరత్‌కుమార్ భట్, ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రెసిడెంట్, డాక్టర్ సమర్థ నాగభూషణం, చిత్రహరిహరన్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



కొంగరకలాన్‌లో కేన్స్ సెమికాన్ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న టీఎస్‌ఐఐసీ ఎండీ నర్సింహారెడ్డి, రాచకొండ సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్

ప్రలోభాలపై నిఘా!

- మద్యం, నగదు, బహుమతుల పంపిణీకి అడ్డుకట్ట
- 13 చెక్ పోస్టులు, 3 ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో చెకింగ్
- సామాజిక మాధ్యమాల పోస్టులపై సీరియస్
- రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల నేపథ్యంలో మోడల్ కాండక్ట్ ఆఫ్ కోడ్ ను సమర్ధవంతంగా అమలు చేసేందుకు అధికారులు, సిబ్బంది కోసం న్యాయ నిపుణులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఫూట్ ఆన్ గ్రౌండ్ సిద్ధాంతాన్ని పాటిస్తున్నామన్నారు. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతి పోలీసు ఆఫీసర్ ఎన్నికల విధులతో పాటు శాంతి భద్రతలు, పౌరుల రక్షణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎప్పుడూ ఒక కాలును ఫీల్డ్‌లో పెట్టే విధంగా సిద్ధంగా ఉండేలా ప్రణాళికలను రూపొందించామన్నారు. రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 నియోజకవర్గాలు వస్తాయని, ఇందులో 7 నియోజకవర్గాలు పూర్తిగా, 6 నియోజకవర్గాల పరిధి కొంత వస్తుందన్నారు. ఈ మేరకు ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన పరిస్థితులపై ఇప్పటికే మూడు సార్లు సమీక్షించడమేగాక వాటి పరిధిలో నెలకొన్న పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకుగాను 13 చెక్ పోస్టులు, 3 ఫ్లైయింగ్ స్క్వాడ్లతో తనిఖీలను ముమ్మరం చేస్తున్నామని సీపీ చౌహాన్ వివరించారు.



సోషల్ మీడియాపై నిఘా...

సోషల్ మీడియా పోస్టింగ్ లపై నిరంతర పర్యవేక్షణను నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దని సీపీ కోరారు. ఒక వ్యక్తిని కించపర్చే విధంగా పోస్టింగ్‌లు పెట్టినా, వాట్సాప్ తో పాటు ఇతర సోషల్ మీడియా మధ్యమాల్లో ప్రచారం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పౌరులు ఎవరైనా ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలతో పాటు ఇతర సమాచారాన్ని డయల్ 100కు అందించాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఫిర్యాదుల పై తక్షణ చర్యలు ఉంటాయని సీపీ స్పష్టం చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని ఏర్పాట్లను చేస్తున్నామని దీని కోసం ముందస్తు ప్రణాళికలతో పట్టు సాధించామని ఆయన వివరించారు.

అభివృద్ధికి పట్టం కట్టండి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే తదితరులు

- ప్రతిపక్ష నేతల మాటలు నమ్మకండి
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం వెంకట్‌రెడ్డి పల్లి, కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణం లోని శ్రీనగర్ కాలనీలోని పార్టీ క్యాంపు కార్యాల యంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాయమాటలు చెబుతు న్నారని ఆరోపించారు. వారి మాటలు నమ్మి మోస పోవద్దని సూచించారు. ఈ సందర్భంగా వెంకట్‌రె డ్డిపల్లి నుంచి పార్టీలో చేరిన వారిలో గోవింద్ నాయక్, శేఖర్, రాజు, చాచా, నర్సింహులు, సూర్యా నాయక్, శేఖర్, మల్లేశ్, శ్రీనివాసులు, సిద్దాపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారుల సం ఘం అధ్యక్షుడు నర్సింహ్మా, లింగయ్య, శివకుమార్, నర్సింహులు ఉన్నారు

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ చోరీ

కందుకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూలదోసి అందులోని విలువైన రాగి తీగను కొందరు దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన కందు కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి పులిమామిడి గ్రామ సమీపాన మల్లేశ్‌కు చెందిన వ్యవసాయ పొలంలో ఒకటి, దాని పక్కనే గ్రామ పంచాయతీకి సంబంధించిన మరో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూలదోసి అందులోంచి విలువైన రాగి తీగను దొంగిలించారు. మంగళవారం ఉదయం గమనించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

విద్యారంగం భ్రష్టు పట్టింది

- నిద్రావస్థలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి
- కాంగ్రెస్‌ను ఆదరించండి.. అభివృద్ధిని ఆస్వాదించండి
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: నిద్రావస్థలో ఉన్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రాంతంలో విద్యారంగం భ్రష్టు పట్టిందని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ఆరోపిం చారు. మంగళవారం మండల పరిధి ఖానాపూ ర్‌లో వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి ఆధ్వర్యం లో పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్సీ పార్టీ కం డువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అత్య ధిక సీట్లు గెలుపొంది రాష్ట్రంలో అధికారం చేపట్ట బోతుందని జోస్యం చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని, అధ్వానంగా మారిన రహదా రులకు మరమ్మతు చేపట్టి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఇంకా నాల్గున్నర ఏళ్ల ఎమ్మెల్సీ పదవి ఉన్నా.. వదులుకొని, కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరానని, చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలుపించాలని కోరారు. ఇం దులో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రదీపురెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, యశ్వంత్ రెడ్డి, శ్రీనివాసురెడ్డి, మధు, చంద్రశేఖర్, లక్ష్మీకాం త్, సంజీవరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, ఎండీ బాబా, పాండుగౌడ్, సురేష్, శ్రీశైలం, నరేష్, మాధవరెడ్డి, గిరి, శివ, రాజు, సాయిలు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్లు శ్రీ సయ్యద్ తాహెర్ హస్సేన్ షుత్తారి, తండ్రి లేట్ సయ్యద్ అస్గారి హస్సేన్ షుత్తారి, దర్గ హజ్రత్ షా అబ్బాస్ సాహెబ్ షా సాహెబ్ పీరన్ సాహెబ్ యొక్క సజ్జాదా నషీన్ మరియు ముతవల్లి హజ్రత్ షా సాదు బాని మసీదు, దర్గ హజ్రత్ షా సాదు బాని సాహెబ్, హైదరాబాద్ గారు, అతని తల్లి సోదరులు మరియు సోదరీలతో పాటు రంగారెడ్డి జిల్లా కందుకూర్ రెవెన్యూ డివిజన్, మహేశ్వరం మండలం, కొంగరఖుర్ద్ 'A' వద్ద గల సర్వే నం.లు 12,14,26,100,137,145,158, 166,167,168,176,154,179,280,281, 283,295,314,343,345,354,355,356, 357,346,169,162,171,172,285,286, 288,300,319,349,350,351,360,361, 362,363 లోని మొత్తం ఎ.237-01 గుంటల విస్తీర్ణం గల భూమిలో అవిభాజ్య వాటా కలిగి ఉన్నారని, వారు దానిని తమ పూర్వీకుల నుండి వారసత్వంగా పొందారని సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియచేయడమైనది.

అది అలా ఉండగా, ఇతర అవిభాజ్య వాటాదారులు ముఖ్యంగా సయ్యద్ జాహెద్ హస్సేన్ షుత్తారి తండ్రి సయ్యద్ హమీద్ హస్సేన్ షుత్తారి మరియు ఇతరులు నా క్లయింట్ల వాటాను వెల్లడించకుండా వారసత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేసేందుకు లేదా తాకట్టు పెట్టేందుకు తీవ్రంగా ప్రయత్ని స్తున్నారు. తదుపరి, సదరు భూమికి సంబంధించి న్యాయస్థానంలో సివిల్ కేసులు పెండింగ్ ఉన్నాయి మరియు నా క్లయింట్లు పైన తెలిపిన వ్యక్తులపై తమ తమ అవిభాజ్య వాటా పొందేందుకు న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

కావున పైన తెలిపిన ఆస్తికి సంబంధించి పైన తెలిపిన వ్యక్తులతో లేదా వారి ద్వారా క్లెయిమ్ చేస్తున్న ఎవరితోనూ ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని నా క్లయింట్ల తరఫున సాధారణ ప్రజలకు హెచ్చరిస్తున్నాను. లేనట్లయితే నా క్లయింట్లు అట్టి లావాదేవీలకు బాధ్యులు కారు. అంతేకాకుండా వారు నా క్లయింట్లు తీసుకునే న్యాయపరమైన చర్యలకు, తమ సొంత ఖర్చులతో బాధ్యులు అవుతారు.

ఇట్లు
ఎస్.బి.మహ్మద్ ఇబ్రహీం, అడ్వకేట్
16-11-16/జి/112,అఫ్జల్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్-36, మొబైల్: 9848887452

'గ్యారంటీ'లతో పేదలకు ప్రయోజనం

బీఆర్‌ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలి

- పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుం దని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేశంపేట మండలం దత్తాయపల్లి సర్పంచ్ మామిడిపల్లి అలివేలు, కొత్తూరు మండలం జేపీ దర్గాకు చెందిన పలువురు మైనార్టీ నాయకులు కాం గ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి శంకర్, మాజీ ఎమ్మెల్యేలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హామీల అమలులో విఫలం

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సీఎం కేసీఆర్.. ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు వస్తు న్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్, బీజేపీలకు తెలం గాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ విజయం సాధిం చడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. ఇందులో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, జమృద్‌ఖాన్, గ్రావ ణ్‌రెడ్డి, బాలరాజు, నర్సింహులు ఉన్నారు.

ఓటర్లే న్యాయనిర్ణేతలు


పార్టీలో చేరిన వారితో కాంగ్రెస్ నేతలు

కొత్తూరు: నియోజకవర్గ ఓటర్లు న్యాయం వైపే ఉన్నారని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎన్ని కల ప్రచారంలో భాగంగా మండలం పరిధి సిద్దాపూ ర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం వారు మాట్లాడారు. న్యాయానికి అన్యాయానికి, ధర్మానికి, అధర్మానికి మధ్య జరగనున్న ఎన్నికల్లో ఓటర్లే న్యాయ నిర్ణేతలని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెక రాల భూమి, కేజీ టూ పీజీ ఉచిత విద్యను ఎందుకు అమలు చేయలేదో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ఇందులో శ్యాం సుందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సుదర్శన్‌గౌడ్, మహేందర్, రాంరెడ్డి, కృష్ణ, నర్సింహ్మా ఉన్నారు.

గంజాయి స్వాధీనం

నిందితుడి అరెస్ట్, రిమాండ్

ధారూరు: వ్యవసాయ పొలంలో గంజాయి సాగు చేసి కర్ణాటక రాష్ట్రంలో విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జి ప్రశాంత్‌వర్ధన్, కోట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సం బంధించిన వివరాలను ధారూరు సీఐ రామకృష్ణ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కోట్‌పల్లి మం డలం మోత్కుపల్లికి చెందిన పాండురం గారెడ్డి(53) గత కొంత కాలంగా తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడు. దీన్ని కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం, సమీప గ్రామాల్లో విక్రయిస్తున్నాడు. ఇటీవల పొలం నుంచి సేకరించిన గంజాయి, గంజాయి విత్తనాలను ఇంట్లో దాచిపెట్టాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి, పోలీసులతో కలిసి నిందితుడి ఇంట్లో సోదా చేయగా.. 10 కిలోల గంజాయి, 860 గ్రాముల గంజాయి విత్తనాలు లభ్యమయ్యాయి. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజ రుపర్చగా నిందితుడికి రిమాండ్ విధిం చినట్లు సీఐ తెలిపారు. గంజాయి లాం టి మత్తు పదార్థాలను ఇతరులకు సరఫరా చేసి విక్రయించిన, ఓటర్లకు ప్రలోభపెట్టేందుకు మత్తు పదార్థాలు, డబ్బులు పంపిణీ చేస్తూ పట్టుబడిన నిం దితులపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

పండుగ పూట విషాదం

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే యువకుడి మృతి


భరత్‌కుమార్ (ఫైల్)

కేశంపేట: పండుగ పూట కుటుంబంలో విషాదం నెలకొంది. దసరా సందర్భంగా బంధువులను కలి సేందుకు హుషారుగా ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థి మార్గమధ్యలోనే మృతి చెందిన సంఘ టన మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శివా రులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలంలోని కోళ్ల పడకల్‌కు చెందిన పాలాది భరత్‌కుమార్ (22) అమ్మమ్మ గారి ఊరైన కేశంపేటకు బైక్‌పై బయలుదేరాడు. అక్కడ అందరికీ శుభాకాంక్షలు చెప్పాడు. అనంతరం అక్కను కలిసేందుకు బైర్కాన్‌పల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొత్తపేట శివారు వద్ద రోడ్డు పక్కన్న నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో భరత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి బంధువు పాలాది జగన్‌మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.


దసరా పండుగ సందర్భంగా మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మహేశ్వరం మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు
- మహేశ్వరం

హస్తం, కమలం అచేతనం

- ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి
- బయటకు రాని కాషాయ దళం
- ప్రచారంలో దూసుకుపోతున్న అధికార పార్టీ


ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మ్యాప్

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరుగా కొనసాగుతుండగా.. మిగి లిన ప్రధాన పార్టీలు కొంత వెనకబడ్డాయి. అధి కార పార్టీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించ డంతో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇప్పటికే పలు గ్రామాలను చుట్టేశారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో పార్టీ క్యాడర్, బూ త్ స్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిం చి, వారిని కార్యోన్ముఖులను చేశారు. దీంతో గులాబీ శ్రేణులు సైతం ప్రచార పర్వంలోకి దిగాయి. అటు ప్రభుత్వం ఇటు ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ముందుకెళ్తున్నారు.

ఊపందుకోని రాజకీయ వేడి

నియోజకవర్గంలో రాజకీయ వేడి ఇంకా ఊపం దుకోలేదు. బీజేపీ తమ అభ్యర్థిగా నోముల దయానంద్‌గౌడ్‌ను ప్రకటించింది. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకొని ఆయన ప్రచారం రంగంలోకి దిగేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తేలలేదు. ఈ టికె ట్‌కు తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. హస్తం నేతలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రాంరెడ్డి టికెట్ తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. బీసీ కోటా నుంచి తనకే అవకాశం దక్కుతుందని శేఖర్‌గౌడ్ ధీమా వ్యక్తంచేస్తున్నారు.

పొత్తుల కలవరం

కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుల నేపథ్యంలో పట్నం సీటు అంశం ఆయా పార్టీల ఆశావహు లను కలవరానికి గురిచేస్తోంది. పొత్తులో భాగం గా ఈ స్థానాన్ని తమకే కేటాయించాలని కమ్యూ నిస్టులు పట్టుబడుతున్నట్లు సమాచారం. సీపీ ఎం, బీజేపీతో పోలిస్తే ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మంచి పట్టుంది. బీఆర్‌ఎస్‌తో పోటీని తట్టుకోవాలంటే ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కీలకంగా మారే అవకాశం ఉంది. కానీ టికెట్ ఎవరికీ కేటాయించకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

'బూర' ఆశలు గల్లంతు

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గతేడాది బీఆ ర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఇబ్రహీంపట్నం సీటుపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. పార్టీశ్రేణులతో ఆత్మీయ సమ్మేళనాలు సైతం నిర్వహించారు. సీటు ఆయనకే వస్తుందని చివరి నిమిషం వరకూ ప్రచారం సాగింది. కానీ దయానంద్‌గౌడ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించ డంతో బూర ఆశలు గల్లంతయ్యాయి.

'కొత్త'కు దక్కని సెకండ్ చాన్స్

2018 ఎన్నికల్లో బీజేపీ తరఫున కొత్త అశోక్‌గౌడ్ పోటీ చేశారు. ఈసారి కూడా తనకే అవకాశం కల్పించాలని ఆయన అధిష్టానానికి విన్నవిం చారు. అతనితోపాటు బీజేపీ నాయకుడు పోరెడ్డి అర్జున్‌రెడ్డి, మర్పల్లి అంజయ్యయాదవ్ కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా ఫలిం చలేదు.

ఆరుట్లలో పోలీసుల కవాతు


ఆరుట్లలో కవాతు చేస్తున్న పోలీసులు

మంచాల: సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసు బలగాలు మంగళవారం మంచాల, ఆరుట్ల గ్రామాల్లో కవాతు చేశాయి. ఈ సందర్భంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సీహెచ్. శ్రీనివాస్ రావు, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్ రావు, ఏసీ సీఏపీఎఫ్ టీం బీఎస్. మీనా, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, 160 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


ఆంజనేయులు(ఫైల్)

కొందుర్గు: మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొందుర్గు మండలం తంగెళ్ల పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి ఆంజనేయు లు(40) భార్య లక్ష్మి రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి జగదీశ్వర్, రాజశేఖర్ ఇద్దరు కుమారులు. జగదీశ్వర్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రాజశేఖర్ 9వ తరగతి చదువుతున్నాడు. అయితే సోమవారం ఉదయం జగదీశ్వర్ డ్యూటీకి వెళ్తుం డగా పండుగపూట డ్యూటీకి వెళ్లొద్దని వారించాడు. వెళ్లకుంటే పనిలో నుంచి తీసివేస్తారని జగదీశ్వర్ తండ్రి మాటలు వినకుండా వెళ్లపోయాడు. దీంతో పండుగరోజు ఇంట్లో ఎవరూ లేరని మనస్థాపానికి గురైన ఆంజనేయులు.. చెర్కుపల్లి గ్రామశివా రులోని పిచ్చకుంట్ల లక్ష్మి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు మృతుడి కుమారుడికి సమా చారం ఇచ్చారు. అయితే అప్పటికే ఆం జనేయులు మృతిచెందాడు. మృతుడి కుమారుడు జగదీశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

తోపులాటలో కిందపడి వ్యక్తి మృతి!


ఎండీ బాబా మృతదేహం

ఇబ్రహీంపట్నం: వారి మధ్య ఎలాంటి పరిచయం లేదు. కానీ తాగిన మైకంలో జరిగిన చిన్న తగాదా వలన ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డుపై సోమవారం రాత్రి చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఎండీ బాబా(31) మూడు నెలల క్రితం ఇబ్రహీంపట్నంకు వచ్చి సెంట్రింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బంధువులైన కందు కూర్ గ్రామానికి చెందిన మల్లేశ్, జనగాంకు చెందిన లక్ష్మణ్‌లు ప్లాస్టిక్ కవర్లు, సీసాలు తదితర వాటిని సేకరించి జీవనం సాగిస్తున్నారు. వారు తాగిన మైకంలో బాబా తగలడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మల్లేశ్, లక్ష్మణ్‌లు బాబాను నెట్టివేయడంతో కిందపడ్డాడు. అనంతరం వారి ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపో యారు. మంగళవారం ఉదయం ఓ వ్యక్తి రోడ్డుపై పడి ఉన్నాడన్న సమాచారంతో.. పోలీ సులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. బాబా అప్పటికే మృతి చెందాడు. అనంతరం సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులిద్దరినీ మంగళవారం ఉదయం పట్టుకు న్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలి పారు. తోసేయడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయాడా? మరేదైనా కారణం ఉందా అనేది పోస్టుమార్టం ఆధారంగా తెలుస్తుందన్నారు. కేసు దర్యాప్తులో ఉంది

భార్య కాపురానికి రావడం లేదని..

కేశంపేట: కుటుంబ తగాదాలతో మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘ టన వేములనర్వలో మంగళవారం చోటుచేసుకుం ది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి వేములనర్వ గ్రామంలో రావిచెట్టి శ్రీను(38) కూలీపనులు చేస్తూ జీవిం చేవాడు. భార్య పుట్టింటికి వెళ్లి ఎంతకీ తిరిగిరా వడం లేదనే బాధతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడి అన్న జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు హెడ్ కానిస్టేబుల్ పాండయ్య తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కొత్తూరు: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధి తీగాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామ సమీప చెరువులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సురేష్ అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుం దని తెలిపారు. ఆమె పసుపు రంగు జాకెట్, ఆకు పచ్చ, నలుపు రంగు చీర ధరించినట్లు పేర్కొ న్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.